వ్యాధిగ్రస్థులకు సెల్ఫ్‌కేర్ కిట్లు అందజేస్తున్న డీఎంపీవో వనాకర్‌రెడ్డి

కుష్టు వ్యాధి నిర్మూలనకు సహకరించాలి

డీపీఎంవో వనాకర్‌రెడ్డి

తొర్రూరు, డిసెంబర్ 18: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్(డీపీఎంవో) చెప్యాల వనాకర్ రెడ్డి అన్నారు. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో బాధితులకు సెల్ఫ్ కేర్‌కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని, సమూలంగా నిర్మూలించాలని కోరారు. వ్యాధిగ్రస్తుల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ప్రతి ఒక్కరూ సహకరించి శాశ్వత లోపాలు, అంగవైకల్య బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. తొలి దశలోనే చికిత్స అందిస్తే వ్యాధిని అరికట్టవచ్చని, తొర్రూరును వ్యాధిరహితంగా తీర్చిదిద్దాలని కోరారు. కాటన్, అయోడిన్, హైడ్రోజన్ పెరాక్సైడ్, మల్టీ విటమిన్ టాబ్లెట్లు, కత్తెర, డెటాల్‌తో కూడిన సెల్ఫ్ కేర్‌కిట్లు బాధితులకు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు మీరాజ్, జ్వలిత, ప్రియాంక, మానస, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్‌వో బాలాజీ

గ్రామాల్లో జ్వరపీడితుల సర్వే చేయాలి

నర్సింహులపేట, డిసెంబర్ 18: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసి జ్వర పీడితులను గుర్తించాలని సీహెచ్‌వో బీ బాలాజీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన సెక్టార్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి జర్వంతోపాటు కుష్టు వ్యాధిగ్రస్తులను గర్తించాలన్నారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు అన్వేశ్, అంజలి, మమత, చందు, వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్‌ఎం ప్రసన్నకుమారి, కృష్ణవేణి, అశ వర్కర్లు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి

ఇన్సూరెన్స్ చెక్కుల పంపిణీ

బయ్యారం, డిసెంబర్ 19: బయ్యారం సహకార పరపతి సంఘంలో సభ్యులుగా ఉండి మృతి చెందిన రైతు కుటుంబాలకు సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి సోమవారం ఇన్సూరెన్స్ చెక్కులు అందించారు. బంచారాయి తండాకు చెందిన లూనావత్ శంకర్, బయ్యారానికి చెందిన రత్తరపు శ్రీను మృతి చెందగా, బాధిత ఒక్కో కుటుంబానికి రూ. 50వేల గ్రూపు ఇన్సూరెన్స్ చెక్కు అందజేశారు. రైతుల కుటుంబాలకు గ్రూప్ ఇన్సూరెన్స్ ఆసరాగా నిలుస్తుంది మధుకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేవ్, సొసైటీ డైరెక్టర్లు బండారి మల్లయ్య, చెరుకుపల్లి నాగమణి, తిరుమల ప్రభాకర్‌రెడ్డి, వేల్పుల శ్రీనివాస్, రైతులు నర్సయ్య, వీరారెడ్డి, ముసలయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు శాశ్వత కుటీరం

నర్సింహులపేట, డిసెంబర్ 18: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప మాలధారుల కోసం శాశ్వత కుటీరం ఏర్పాటుకు సోమవారం మాలధారులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శివాలయం ప్రధాన అర్చకుడు దేవేంద్రశర్మ పూజలు చేశారు. దాతల సహకారం, మాలధారులు పోగు చేసుకున్న కొంత నగదుతో శాశ్వత కుటీరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు యాదగిరి, భిక్షం, నర్సయ్య, మధు, కనకం, రవి, మాలధారులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

పెద్దవంగర: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దవంగర, డిసెంబర్ 18: మండలంలోని అవుతాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం సౌజన్య రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పీ కళాధర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సౌజన్య ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లా ధర్మారంలో జరిగిన పోటీల్లో ఉన్నత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 20 నుంచి 22వరకు ఆసిఫాబాద్‌లో జరిగే 67వ ఎస్‌జీఎఫ్ఐ క్రీడల్లో పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా సౌజన్య, సహకరించిన పీఈటీ జీ సునీతను సర్పంచ్ సల్దెండి మంజుల, ఎస్ఎంసీ చైర్మన్ ఏ సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, రమేశ్‌కుమార్, రామ్మోహన్, రవి, శ్రీను, నర్సింమారావు, శ్రీనివాస్, వెంకట్, రత్నం, సునీతారాణి, జనార్దన్, రామతార పాల్గొన్నారు.

కేసముద్రం విద్యార్థులు..

కేసముద్రం: మండలంలోని కేసముద్రం విలేజి హైస్కూల్‌కు చెందిన రామ్‌చరణ్, రాజేశ్వరి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనుట్ల పాఠశాల హెచ్ఎం కొత్త జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఈ నెల 22 నుంచి ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలిస్తున్న నోడల్ ప్రధానాపాధ్యాయుడు బుచ్చయ్య

తొర్రూరు, డిసెంబర్ 18: విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని నోడల్ ప్రధానోపాధ్యాయుడు మహంకాళి బుచ్చయ్య అన్నారు. సోమవారం వెలికట్ట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థుల నమోదు, హాజరు శాతం పరిశీలించారు. ఈ సందర్భంగా నోడల్ హెచ్ఎం మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, ఫేషియల్ అటెండెన్స్ నిర్వహించాలని, వారి అభ్యున్నతికి హెచ్ఎం, ఉపాధ్యాయులు పాటుపడాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. ఎంపీపీఎస్ సోమాలతండా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టీక్యాతండా, పెద్దమంగ్య తండా, యూపీఎస్ నాంచారి మాడూర్ పాఠశాలలను సందర్శించారు.

ఆడపిల్లలపై వివక్ష చూపొద్దు : ఐసీడీఎస్ సీడీపీవో

మాట్లాడుతున్న సీడీసీవో నీలోఫర్

గూడూరు, డిసెంబర్18: సమాజంలో ఆడపిల్లలపై వివక్ష చూపవద్దని, అందరితో సమానంగా చూడాలని గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో నీలోఫర్ ఆజ్మీ అన్నారు. సోమవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ప్రాజెక్టు పరిధిలోని గూడూరు, కొత్తగూడ, గంగారం మండలాల అంగన్‌వాడీ టీచర్లకు 'బేటీ బచావో బేటీ పడావో' అంశం పై అవగాహన కల్పించారు. బాలికల రక్షణలో తల్లితండ్రులతో పాటు అంగన్‌వాడీల పాత్ర కీలకమని, ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలన్నారు. బాలికలకు అవగాహన కలిగించాలని, చదువు నేర్పించాలని, వారి ఎదుగుదలకు మహిళా సాధికారతను వివరించాలన్నారు. వారి హక్కులు, విధులు, ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, బాల్యవివాహాలతో అనర్థాల గురించి వివరించాలన్నారు. ప్రభుత్వం మహిళలు, బాలికల రక్షణకోసం అందిస్తున్న హెల్ప్‌లైన్లు 1098, 181,100,14567 గురించి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సాధికారత కేంద్రం బాధ్యులు అరుణ, సంధ్యారాణి, రాకేశ్ పాల్గొన్నారు.

భూక్యా భరత్‌కు నేషనల్ గోల్డ్‌మెడల్

గోల్డ్ మెడల్‌తో భరత్

కురవి, డిసెంబర్ 18: రాజోలు, హరిదా సుతండా శివారులోని బాలుతండాకు చెందిన భూక్యా భరత్‌నాయక్ నేషనల్ గోల్డ్ మెడల్ అందుకున్నాడు. ఆదివారం ఓరుగల్లు డ్రాగన్ స్కూల్ ఆఫ్ జపాన్ కరాటే షోటోకాన్ కాజీపేట థర్డ్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ -2023 జాతీయ స్థాయి పోటీల్లో భరత్ నాయక్ పాల్గొని నేషనల్ గోల్డ్ మెడల్ అందుకున్నట్లు తల్లిదండ్రులు బాలునాయక్, స్వర్ణలత తెలిపారు. మహర్షి హైస్కూల్‌లో భరత్ నాల్గవ తరగతి చదువుతున్నట్లు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

నర్సింహులపేట, డిసెంబర్ 18: మండలంలోని అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఆర్ పాండు సోమవారం తెలిపారు. వడ్డేకొత్తపల్లి 220 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా కొమ్ములవంచ, పెద్ద నాగారం, కౌసల్యదేవిపల్లి, ముంగిమడుగు సబ్‌స్టేషన్ల పరిధిలోని 22 గ్రామ పంచాయతీలకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు, రైతులు సహకరించాలని ట్రాన్స్‌కో ఏఈ కోరారు.

పెద్దవంగరలో 3ఫేజ్ విద్యుత్..

పెద్దవంగర : మండలంలోని వడ్డేకొత్తపల్లి 220కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఈ నెల 20న 3ఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి కబ్బడీ పోటీలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

గార్ల, డిసెంబర్ 18: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కోటేశ్వరి సోమవారం తెలిపారు. కురవిలో జరిగిన జిల్లాస్థాయి కబడీ పోటీల్లో అండర్-17 విభాగంలో జీ పూజిత, అండర్-14 విభాగంలో టీ జమున పాల్గొని మొదటి బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, పీడీఈ పద్మ, పీటీ సుశీలను ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు బ్రిలియంట్ హైస్కూల్ విద్యార్థి ఎంపిక

మెహల్

డోర్నకల్, డిసెంబర్ 18: ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు డోర్నకల్ బ్రిలియంట్ హై స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న మెహల్ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ అప్పారావు సోమవారం తెలిపారు. విద్యార్థిని కరస్పాండెంట్ అప్పారావు, ప్రిన్సిపాల్ అఫ్సర బేగం, పీఈటీ విజయ్‌కుమార్ అభినందించారు.

ఏఐఎస్ఎఫ్ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఇన్‌చార్జిగా స్టాలిన్

కేసముద్రం, డిసెంబర్ 18: తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఏఐఎస్ఎఫ్ ఇన్‌చార్జిగా అమీనాపురం గ్రామానికి చెందిన ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ నియామకమయ్యాడు. ఈ నెల 16,17 తేదీల్లో ముంబైలోని భూపేశ్‌గుప్తా భవన్‌లో నిర్వహించిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జాతీయ సమితి సమావేశాల్లో రెండు రాష్ట్రాల ఇన్‌చార్జిగా అశోక్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకముంచి నియమించిన ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యా రంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం దిశగా మరిన్ని మిలిటెంట్ పోరాటాలు నిర్వహించేలా ఆయా రాష్ట్రాల సభ్యులను పటిష్టంగా తయ్యారు చేస్తానన్నారు. దేశంలో ఏఐఎస్ఎఫ్‌ను బలమైన శక్తిగా నిలిపేందుకు కృషి చేస్తానని పేర్కొన్నాడు.

వివాహిత అదృశ్యం

అరుణ (ఫైల్)

గార్ల, డిసెంబర్ 18: వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని సీతంపేట గ్రామంలో జరిగింది. ఎస్సై బానోత్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం... సీతంపేట గ్రామానికి చెందిన వంగాల పవన్, మహబూబ్ నగర్‌కు చెందిన అరుణ 2021లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఒక బాబు ఉన్నాడు. ఈనెల 16న భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో పవన్ ఇంట్లో లేని సమయంలో కుమారున్ని తీసుకొని అరుణ ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువులు, స్నేహితుల ఇంట్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.